క్లుప్తంగా

రంజాన్ తోఫా అందజేత

తెనాలి: పట్టణ చినరావూరు 13వ వార్డులోని ముస్లిం కుటుంబాలకు మంగళవారం సాయంత్రం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ముస్లిం మైనారిటీ నాయకుడు షేక్ బాబు ఆధ్వర్యంలో అక్కడి ముస్లిం సోదరులతో ఏర్పాటైన సమావేశంలో దాదాపు వంద మందికి రంజాన్ తోఫా అందజేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పండుగ సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. నిర్వాహకులను అభినందించారు. పఠాన్ ఖాజా, పఠాన్ షరీఫ్, కుర్రా శ్రీను, గుంటూరు కోటేశ్వరరావు, మన్నవ ప్రభాకర్, వీరయ్య, కంచర్ల శ్రీను, నాగరాజు, షేక్ షఫీ, సయ్యద్ మస్తాన్, అక్కిదాసు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలిటౌన్: క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా గాంధీనగర్‌లోని శ్రీ షిరిడీ సాయి వృద్ధాశ్రమంలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు అన్నదానం చేశారు. సంగారెడ్డి గ్రామస్తులు తలారి నరసింహులు వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యోగా టీచర్ బి.సుజాత మాట్లాడుతూ ప్రతి రోజు వృద్ధులు యోగా, ధ్యానం చేయడం వలన మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యవంతులు అవుతారని తెలిపారు. ఉగాది పండుగ పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపి ఉగాది పచ్చడిని అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీ యోగా కన్వీనర్ ఎం.రమణయ్య, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత, తేజశ్రీ, నరసింహ, పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరి



తెనాలిటౌన్: నెహ్రూరోడ్డులోని రుక్మిణి సత్యభామ సమేత గోవర్ధన స్వామి దేవాలయ ఆవరణలో క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా మంగళవారం రాత్రి సంగీత సద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహించారు. విజయవాడకు చెందిన శాంత బృందం సభ్యులు వివిధ వాగ్గేయ కరకృత్తులు(రామపదమైన), కీర్తనలు గానం చేశారు. వయోలిన్‌పై చావాలి శ్రీనివాస్ (విజయవాడ), మృదంగంపై కెవి.రామకృష్ణ (తెనాలి) సహకరించారు. అనంతరం పంచాగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా సమితి కన్వీనర్ రామకృష్ణ పర్యవేక్షించారు.

చలివేంద్రం ఏర్పాటు



తెనాలిటౌన్: కొత్తపేటలోని విశ్వకర్మ దేవాలయం ఆవరణలో శ్రీ ఆంజనేయం ధ్యాన యోగా మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా తులసి ఆకుల చలివేంద్రాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లీశ్వరి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కిషోర్ గురూజీ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు చలివేంద్రం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశ్వకర్మ దేవాలయ చైర్మన్ నూతలపాటి సురేష్, చలివేంద్రం కన్వీనర్ తాడికొండ శ్రీనివాసరావు, నాగరాజు, ముంతా శ్రీనివాసరావు, కోమల, కుమారి చంద్రిక, గొడవర్తి సత్యనారాయణ, దూపుగుంట్ల రమేష్, సుబ్బారావు, సూర్యనారాయణ, వరలక్ష్మి, గుప్తా, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

ముస్లింలకు డ్రైఫ్రూట్స్ పంపిణీ

నిడుముక్కల (తాడికొండ): మండల పరిధిలోని నిడుముక్కల గ్రామంలో ముస్లింలకు సెమియా, డ్రైఫ్రూట్స్ వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల అధ్యక్షుడు బెజ్జం సాయిప్రసాద్, సర్పంచి మాదాసు రత్నకుమారి మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిడుముక్కల ఎంపీటీసీ బోడపాటి సుశీల, జిల్లా ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి బి.వెంకటస్వామి, మాజీ ఉపసర్పంచ్ మాదాసు ఏసురత్నం, జిల్లా ఎస్సీసెల్ నాయకులు తోకల నరసింహారావు, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి వెండి నాగాభరణం అందజేత



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడులోని విశాలాక్ష్మి, అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పి.వెంకటరెడ్డికి గుంటూరుకు చెందిన కె.భక్తవత్సలరెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు వెండి నాగాభరణం మంగళవారం అందజేశారు. ఆలయ అర్చకులు రావూరి పూర్ణానందశాస్త్రి, ఆంజనేయశాస్త్రి ఆశీర్వదం అందజేశారు.

పన్ను చెల్లింపుదారులకు పురపాలిక తీపి కబురు

- పన్నుల చెల్లింపుపై అయిదు శాతం రాయితీ ప్రకటన
- 39,091 మంది చెల్లింపుదారులకు లబ్ధి
- ప్రారంభమైన చెల్లింపులు



పన్నులు చెల్లిస్తున్న పట్టణ వాసులు

తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలో నివసించే వారికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. తమ ఇంటి, ఖాళీ స్థలాల పన్నులను ఒకేసారి ఈ నెల 30వ తేదీ లోపు చెల్లిస్తే పన్నులో అయిదు శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దీంతో గృహ, ఖాళీ స్థల యజమానులు పన్నుల చెల్లింపులను ప్రారంభించారు. తెనాలి పురపాలక సంఘ పరిధిలో ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు వెరసి ఏడాదికి సుమారు రూ.18 కోట్ల ఆదాయం పురపాలికకు సమకూరుతూ ఉంటుంది. తెనాలి పట్టణ పరిధిలో సుమారు 36,385 నివాస గృహాలు ఉన్నాయి. వీటికి ఏడాదికి రెండు సార్లు పన్ను విధించి వసూలు చేస్తుంటారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఒకసారి, అక్టోబర్ నుంచి మార్చి వరకు మరోసారి పన్నులను విధించి వసూలు చేస్తుంటారు. పన్నుల రూపంలో ప్రతి ఏడాది వీటి ద్వారా సుమారు రూ.17 కోట్ల ఆదాయం మున్సిపాలిటీకి సమకూరుతుంది. ఇదికాకుండా మున్సిపాలిటీ షాపుల అద్దె కింద సుమారు రూ.1.80 కోట్లు ఆదాయం సమకూరుతూ ఉంటుంది. తెనాలి పట్టణంలో 2,706 కాళీ స్థలాలు ఉన్నాయి. వాటి ద్వారా సుమారు రూ.కోటి ఆదాయం మున్సిపాలిటీకి సమకూరుతూ ఉంటుంది. వీటన్నింటిపై తెనాలి పురపాలక సంఘానికి ఏడాదికి రూ.19.80 కోట్ల ఆదాయం సమకూరుతుందని చెప్పవచ్చు.

జిల్లాలో తెనాలి పురపాలిక మొదటి స్థానం

తెనాలి పురపాలక సంఘం జిల్లాలోనే సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా రూపుదిద్దుకుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్పెషల్ గ్రేడ్‌గా ఉన్న తెనాలికి సెలక్షన్ గ్రేడ్‌ను ఇచ్చింది. గతేడాది పన్నుల రూపంలో రూ.16.72 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా 2024 మార్చి 31వ తేదీ నాటికి రూ.14.58 కోట్లు వసూలు చేశారు. మిగిలిన రూ.2.14 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. దీనిని బట్టి చూస్తే పన్నుల వసూలులో తెనాలి ముందు వరుసలో ఉందనే చెప్పవచ్చు. గతేడాది పన్నుల వసూలులో రాష్ట్రంలోని పురపాలక సంఘాలలో తొమ్మిదో స్థానం, జిల్లాలో ప్రథమ స్థానం సాధించిందని అధికారులు తెలిపారు.

39,091 మందికి రాయితీ అర్హత

తెనాలి పట్టణంలోని ఇంటి, కాళీ స్థల యజమానులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వాటి పన్నులను ఈ నెల 30వ తేదీ లోపు ఒకేసారి చెల్లిస్తే అయిదు శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించింది. దీంతో తెనాలి పట్టణంలోని 36,385 మంది ఇంటి యజమానులకు, 2,706 మంది కాళీ స్థల యజమానులకు రాయితీ వర్తిస్తుంది. దీనిని బట్టి చూస్తే తెనాలి పట్టణంలో 39,091 మందికి ప్రభుత్వ ప్రకటన మేలు చేయనుంది.

సకాలంలో పన్నులు చెల్లించి రాయితీ పొందండి



తెనాలి పట్టణ పరిధిలో పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం రాయితీ ప్రకటించింది. ఈ నెల 30వ తేదీ లోపు ఏడాది పన్నును ఒకే సారి చెల్లిస్తే అయిదు శాతం రాయితీ పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. తెనాలి మున్సిపల్ కార్యాలయంలోని పన్నుల చెల్లింపు కేంద్రంలో గానీ ఆన్‌లైన్‌లో గానీ వీటిని చెల్లించవచ్చు. పట్టణంలోని ఇంటి, ఖాళీ స్థలాల యజమానులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి.

–సోమశేఖర యాదవ్, రెవెన్యూ అధికారి, తెనాలి పురపాలక సంఘం

సంక్షేమ సారథికి అండగా నిలవండి



ఎన్నికల ప్రచారంలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప

కొల్లిపర: నిత్యం ప్రజల అభ్యున్నతి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ సార్వత్రిక ఎన్నికల్లో అండగా నిలవాని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప ప్రజలను కోరారు. కొల్లిపర గ్రామంలో ఐదో రోజు మంగళవారం సాయంత్రం స్థానిక నాయకులు, తన చిన్న కుమారుడు అన్నాబత్తుని అఖిల్ గణేష్‌తో కలసి ఆరిమండ కల్యాణ మండపం వద్ద నుంచి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో అందించిన సంక్షేమం, గ్రామానికి చేసిన అభివృద్ధిని తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో అంతా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని తెలిపారు. ప్రతి కుటుంబం ఇప్పుడు పొందిన లబ్ధి కన్నా మరింత లబ్ధిని పొందాలంటే మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మరొకసారి తెనాలి శాసన సభ్యులుగా తన భర్త అన్నాబత్తుని శివకుమార్, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ రాధిక, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు బట్టిప్రోలు వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షులు ఆరిమండ కృష్ణారెడ్డి, గుడ్‌విల్ కృష్ణారెడ్డి, కళ్లం వీరారెడ్డి, జొన్నల శివారెడ్డి , అన్నవరపు రమేష్, భీమవరపు శివకోటిరెడ్డి, భీమవరపు సుజాత, వార్డు మెంబర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం



పంచాంగ శ్రవణం వింటున్న ఎమ్మెల్యే శివకుమార్

- పంచాంగ కర్త బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథ శర్మ
- ఉగాది వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే శివకుమార్




హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న చిన్నారులు

తెనాలిటౌన్: సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి పెంచుకోవాలని బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథ శర్మ పేర్కొన్నారు. క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా బోసురోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో సహస్రగళ శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ మహోత్సవం నిర్వహించారు. హనుమాన్ సేవా సమితి, పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, శశి గ్రూప్ ఆధ్వర్యంలో పారాయణం జరిపారు. హనుమాన్ సేవా సమితి నిర్వాహకులు వుప్పల వరదరాజులు ఆధ్వర్యంలో చిన్నారులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం ఉగాది పంచాగ శ్రవణం జరిపారు. బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథశర్మ పంచాగ శ్రవణం చేశారు. పంచాగ శ్రవణంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని పంచాగ శ్రవణాన్ని ఆలకించారు. అనంతరం ఎమ్మెల్యే శివకుమార్, నాయకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు నూకల వెంకట వేణుగోపాలరావు, కార్యదర్శి బూరెల నరసింహారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, హనుమాన్ సేవా సమితి నిర్వాహకులు వుప్పల వరదరాజులు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆలమూరి విజయలక్ష్మి కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాలి శేషాచలం, గొడవర్తి సాయి హేరామ్, నాళం రజనికుమార్, కఠారి హరీష్, విశ్వేశ్వరరావు, కాళిదాసు వెంకటేశ్వరరావు, ఎస్.రఘురామిరెడ్డి, పెసర్లంక రమణ, మీరావళి తదితరులు పాల్గొన్నారు.

వైఖానస ఆగమ అర్చకుడికి సన్మానం

ఫిరంగిపురం: ఫిరంగిపురం గ్రామానికి చెందిన వైఖానస ఆగమ వేదపండితుడు, వేణుగోపాల స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణం ప్రసాదాచార్యులను మంగళవారం కలెక్టర్ వేణుగోపాలరెడ్డి సన్మానించారు. ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని గుంటూరు కలెక్టర్ నివాసంలో నిర్వహించిన అర్చకులకు సన్మానం కార్యక్రమంలో నారాయణం ప్రసాదాచార్యులను శాలువా, సన్మానపత్రంతో సన్మానించారు. ఈఓ రామిరెడ్డి, ధర్మకర్త నాగవెంకటరమణ, అర్చకులు ప్రసన్నమూర్తి, మురళి అభినందనలు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని వైఎస్సార్ సీపీ పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని చాందినీ చౌక్ సెంటర్‌లో ముస్లిం మైనారిటీ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన ఇఫ్తార్ విందుకు వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, అంబటి మురళీకృష్ణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థన నిర్వహించి ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అల్లా చెప్పిన విధంగా తోటి వారిపై ప్రేమ, దయ, జాలి, కరుణ చూపిస్తూ, తోచిన సహాయ సహకారాలు చేయడం అన్నది ఆదర్శప్రాయ మార్గం అన్నారు. ఈ మంచి గుణం అందరిలోనూ ఉంటే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తుందన్నారు. అల్లా దివ్య ఆశీస్సులు మానవాళి అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ రూత్ రాణి, నాయకులు బడా గోరా, నన్న గోరా, అడితి మౌలాలి, వడ్రాణం ప్రసాద్, షేక్ నాజర్, వట్టిప్రోలు రంగారావు, బొద్దులూరి రంగారావు, అంబటి వెంకటేశ్వరరావు, అమిరినేని సాంబశివరావు, ఆకుల రామ్మోహన్, బోయి నాగరాజు, సయ్యద్ సుభాని, రుద్రపాటి ఆదిశేషులు, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండరు ఆవిష్కరణ



తెనాలి: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో రూపొందించిన త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండరు (త్రైత శకం–46)ను మంగళవారం తెనాలిలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరణ అనంతరం తెలుగు క్యాలెండరును తెనాలి డీఎస్పీ, త్రీటౌన్ పోలీస్ కార్యాలయంలో సిబ్బందికి అందజేశారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి అందరికీ అర్థమయ్యేలా సరళమైన భాషలో రూపొందించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. తెలుగు నెలలు అనుసరించేందుకు వీలుగా తెలుగు తిథులతో, ఆంగ్ల తేదీలతో కాల సూచికను తీసుకొచ్చినట్లు వివరించారు.

నేడు 17 వ వార్డులో లావణ్య ప్రచారం

మంగళగిరి: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య బుధవారం పట్టణంలోని 17వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రచారంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పాల్గొంటారని పేర్కొన్నారు.

తాడికొండ అడ్డరోడ్డు వద్ద నగదు స్వాధీనం

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 1,63,500 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సిహెచ్.ప్రభాకర్ తెలిపారు. తాడికొండ శివారు బడేపురం గ్రామానికి చెందిన మద్దినేని సురేష్‌బాబు కారులో రూ.లక్ష, గుంటూరు పట్టణానికి చెందిన చిలకపాటి చతుర్వేది రూ.63,500 కారులో తీసుకుని వెళుతున్న సమయంలో తనిఖీల్లో పట్టుబడినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదు ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు చెప్పారు.

భక్తులపాలిట కల్పవల్లి పోలేరమ్మతల్లి

నెహ్రూనగర్: భక్తుల పాలిట కల్పవల్లి, కోరిన కోర్కెలు తీర్చే కరుణామయి పోలేరమ్మ తల్లి అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు వెస్ట్ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. గుంటూరు అమరావతి రోడ్డు 49వ డివిజన్‌లోని కొండయ్య కాలనీ ఒకటో లైనులో ఉన్న లక్ష్మీ పోలేరమ్మ తల్లి దేవస్థానం మూడో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మంత్రి రజిని ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం కమిటీ సభ్యులకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలేరమ్మ తల్లి మహిమ గల అమ్మవారని, భక్తులు నిండు విశ్వాసంతో, పవిత్ర హృదయంతో పూజలు చేస్తే, తప్పకుండా వారికి మంచి జరుగుతుందని తెలిపారు. అమ్మవారి చల్లని ఆశీస్సులతో ఈ ఏడాది అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నానన్నారు.

రామాలయానికి శఠగోపం అందజేత



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని వైఎస్సార్ సెంటర్(కొత్తూరు)లో వేంచేసిన యున్న శ్రీ కోదండ సీతారామాలయం దేవస్థానానికి కళ్లం వెంకటరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరఫున శఠగోపురాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కళ్లం రాజశేఖరరెడ్డి, ఆయన సతీమణి నాగమణి మాట్లాడుతూ తాడేపల్లి శ్రీ కోదండ సీతారామాలయంలో పూర్వకాలం నుంచి ఉన్న శఠగోపురం పాడవడంతో రూ.55 వేలతో కొత్త శఠగోపురం, వెండిపళ్లెం అందజేసినట్లు తెలిపారు. పూజారి శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్లం రాజశేఖరరెడ్డి దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, స్థానికులు మేకా అంజిరెడ్డి పాల్గొన్నారు.

నిజాయతీ, నిబద్ధతతో సేవలు

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- ఆరు నియోజకవర్గాల్లో మార్పులు జరిగినా తెనాలిలో తనకు అభ్యర్థిత్వం దక్కడంపై స్పందన
- 15 నుంచి రోడ్‌షోలతో విస్తృత ప్రచారం
- 22న ఎన్నికల నామినేషను దాఖలు
- మున్నంగిలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం



మున్నంగిలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి విధేయుడిగా కొనసాగడంతో పాటు ఎమ్మెల్యేగా నిజాయతీ, అంకితభావంతో పని చేయటం ద్వారా మరోసారి తెనాలి నుంచి పోటీకి తనకు అవకాశం దక్కిందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పార్లమెంటు పరిధిలోని ఏడింటిలో ఆరు నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు జరిగినా తెనాలి నుంచి సిటింగ్ ఎమ్మెల్యేగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారని గుర్తుచేశారు. కొల్లిపర మండల గ్రామం మున్నంగిలో సోమవారం రాత్రి పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణంలోని వార్డులు, మండలాల్లో గ్రామలవారీగా సమావేశాలు జరిపినట్లు చెప్పారు. తన కుటుంబ సభ్యులు ఇప్పటికే ఇంటింటి ప్రచారంలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి వారంలో ఆరు రోజులు రోడ్‌షో ప్రచారాలకు షెడ్యూలు ఖరారు చేసినట్లు ఎమ్మెల్యే శివకుమార్ చెప్పారు. విస్తృతంగా ప్రచారాన్ని కొనసాగిస్తూ ఈనెల 22న నామినేషను దాఖలు చేయనున్నట్టు వెల్లడించారు. ఎమ్మెల్యేగా గెలిచిన దగ్గర్నుంచి నిత్యం ప్రజల్లోనే ఉంటూ తనకు అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, గెలిపించిన ప్రజలకు మాట తీసుకురాకుండా వ్యవహరించినట్టు ఆయన గుర్తుచేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. రెండేళ్లపాటు కరోనా మహమ్మారి పీడించినా సంక్షేమ పథకాలను ఆపకుండా అందజేశామన్నారు. అందుకే ప్రజలు జగనన్నకు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడినందునే ప్రజల తిరస్కారానికి గురైందని గుర్తుచేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వలంటీర్లు, సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ఏమాత్రం అవినీతి లేకుండా సంక్షేమాన్ని అందించారని చెబుతూ ఇదే నిజమైన పరిపాలనగా పేర్కొన్నారు. పార్టీ నేతలు ఆరిగ చంద్రారెడ్డి, కళ్లం వెంకటప్పారెడ్డి, ఆళ్ల శివనాగిరెడ్డి, బొంతు శ్రీనివాసరెడ్డి, వేమూరి కిషోర్, రామయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పని చేయాలి

మున్నంగి(కొల్లిపర): రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పిలుపునిచ్చారు.మండలంలో మున్నంగి గ్రామంలో సోమవారం రాత్రి పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. గ్రామాల్లోని ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. గ్రామంలో నాయకులు ఎటువంటి ద్వేషాలు పెంచుకోకుండా అందరూ కలసికట్టుగా ఉండి పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆరిగ చంద్రారెడ్డి, కళ్ళం వెంకటప్పారెడ్డి, వేమూరి ధీనమ్మ, ఆళ్ళ నాగిరెడ్డి, వేమూరి కిషోర్‌బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఉగాది వేడుకలు

- పలు చోట్ల పండితుల పంచాగ శ్రవణం
- ఆలయాలకు తరలి వచ్చిన భక్తజనం



పంచాగ శ్రవణ కర్త రాధాకృష్ణ శర్మను సత్కరిస్తున్న నిర్వాహకులు

తెనాలిటౌన్: క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను పట్టణ, రూరల్ గ్రామాల్లోని ప్రజలు మంగళవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తెలుగు వారికి తొలి పండుగ అయిన ఉగాదిని ఆనందోత్సాహాలతో జరుపుకుని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు సాహితీ సౌరభం ఆధ్వర్యంలో పట్టణ పినపాడులో సిద్ధాంతి మోదుకూరి రాధాకృష్ణ శర్మచే పంచాంగ శ్రవణం జరిపారు. తెలుగు సంవత్సర పర్వదినం ప్రత్యేకతను, పంచాగ శ్రవణ ప్రాముఖ్యతను, వివిధ రాశుల ఫలితాలను వివరించారు. అనంతరం షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి వితరణ జరిపారు. షడ్రుచుల ప్రాముఖ్యతను, వైజ్ఞానికంగా వాటి సత్ఫలితాలను రాధాకృష్ణశర్మ వివరించారు. కార్యక్రమంలో తెలుగు సాహితీ సౌరభం వేదిక సభ్యులు పాల్గొన్నారు.

దేవుని సేవకులు ఐక్యతగా ఉండాలి




సమావేశంలో మాట్లాడుతున్న బిషప్ సుధీర్‌కుమార్

తెనాలిటౌన్: దేవుని సేవకులు ఐక్యతగా ఉండాలని దేవుడిని నమ్ముకుంటే గొప్ప కార్యాలు సాధించగలమని ఈరే మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ సుధీర్‌కుమార్ అన్నారు. రూరల్ మండలం నందివెలుగు ఇందిరా కాలనీలోని యెహోవా ఈరే చర్చిలో మంగళవారం తెనాలి మండల పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. సమావేశానికి ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవరెండ్ ఎ.భానుప్రసాద్ అధ్యక్షత వహించగా ఫెలోషిప్ కోశాధికారి ఎం.బర్నబాసు స్వాగతం పలికారు.

సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బిషప్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ ఏసుక్రీస్తుకు అసాధ్యమైన కార్యములు ఏమిలేవని అన్నారు. ఫెలోషిప్ ద్వారా మండల గ్రామాల్లో దైవసేవకులు పరిచర్యలను చేయాలని సూచించారు. ప్రార్థన కూడికలు నిర్వహించే పాస్టర్లు దైవసేవకులకు నిర్వహణ నిమిత్తం ఆర్థికసాయం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రెసిడెంట్ భాను ప్రసాద్ మాట్లాడుతూ ఫెలోషిప్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి నెల రెండో మంగళవారం ఫెలోషిప్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో సెక్రటరీ రాకడ పీటర్ పాల్, వైస్ ప్రెసిడెంట్ రమేష్, కోశాధికారి బర్నబాబు, జాయింట్ సెక్రటరీ సువర్ణరాజు, ఎగ్జిక్యూటివ్‌మెంబర్స్ అజిత్, యోబు, ఏసుబాబు, లోకా, బిషప్ జడ్సన్, రెవరెండ్ ఎం.జానుబాబు, కిస్టఫర్, రాజశేఖర్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల మహేష్, మండల పరిధిలోని పలువురు పాస్టర్లు, దైవసేవకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టిప్పర్

ఒకరి మృతి



మృతిచెందిన బుల్లి వెంకయ్య

మేడికొండూరు: ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వచ్చిన క్రషర్ టిప్పర్ బలంగా ఢీకొంది. ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పేరేచర్ల డొంకలో మంగళవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని డోగిపర్రు గ్రామానికి చెందిన ఉడతా బుల్లి వెంకయ్య, స్నేహితుడు మొక్కల బ్రహ్మయ్య ద్విచక్ర వాహనంపై చేబ్రోలు మండలం అనంతారం వెళ్లి తిరిగి ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలో పేరేచర్ల డొంక వద్దకు రాగానే వెనుకగా వచ్చిన క్రషర్ టిప్పర్ లారీ బలంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ఉడతా బుల్లి వెంకయ్య(33) రోడ్డుపై పడడంతో లారీ అతడిపైగా వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్న మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. బ్రహ్మయ్యకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.